

ప్రైవేటుకు దీటుగా జూనియర్ కళాశాల

గత ప్రభుత్వ హయాంలో ప్రత్యేక వసతులు • పరీక్షల్లో చక్కని ఫలితాలు • ఈ నెలాఖరు వరకు ఇంటర్‌లో ప్రవేశాలు



కళాశాలలోని వేదిక, విశాలమైన ప్రాంగణం

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రైవేట్ కళాశాలలకు దీటుగా మంచి ఫలితాలను సాధిస్తోంది. నైపుణ్యం గల అధ్యాపకులతో పాటు అన్ని రకాలైన సదుపాయాలు ఉండడంతో విద్యార్థులు చదువుకునేందుకు అనువైన వాతావరణం ఉంటోంది. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ఇక్కడ చేర్పేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

గత ప్రభుత్వంలో రూ.1.26 కోట్లతో అభివృద్ధి

గతంలో ఈ కళాశాల పరిస్థితి దయనీయంగా ఉండేది. పాడైపోయిన తరగతి గదులు, బెంచీలు సరైనవి లేకపోవడం, మరుగుదొడ్లు, మంచినీటి సదుపాయాలు అంతంతమాత్రంగా ఉండటంతో విద్యార్థులు రోజూ అవస్థలు పడేవారు. చాలా మంది ఇక్కడ చేరేందుకు కూడా ఆసక్తి చూపేవారు కాదు. కానీ, గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విద్యపట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. నాడు–నేడు ద్వారా కళాశాల రూపురేఖలే మారిపోయాయి. కళాశాల అభివృద్ధికి రూ.1.26 కోట్లు మంజూరు చేసింది. ఇందులో రూ 28.44లక్షలతో అన్ని గదులకు అవసరమైన మరమ్మతులు చేశారు. రూ. 20.99లక్షలతో తరగతి గదుల్లో కొత్త ఫర్నిచర్, ఫ్యాన్లు, డిజిటల్ బోర్డుల ఏర్పాటు జరిగింది. రూ 23.12లక్షలతో విద్యార్థినులకు, విద్యార్థులకు వేరువేరుగా మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. రూ. 8లక్షలతో స్వచ్ఛమైన నీరు అందించే ఆర్వో ప్లాంట్ ఏర్పాటైంది. దీంతో ఒక్కసారిగా కళాశాలకు కొత్త కళ వచ్చింది. ఈ మార్పుతో విద్యార్థులు బాగా చదువుకోవడానికి అవకాశం ఏర్పడడంతో పాటు అధ్యాపకులకు కూడా పాఠాలు బోధించడానికి అనువైన వాతావరణం ఏర్పడింది. అంతకు ముందు అందరూ నిరాశతో ఉండగా.. సదుపాయాలు వచ్చిన తరువాత ఈ కళాశాలలో చేరాలని అధ్యాపకులు కూడా పలువురికి సూచిస్తున్నారు.

కళాశాలలో గ్రూపులు, కోర్సులు

ఈ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ గ్రూపులు ఉన్నాయి. ప్రతీ గ్రూపులో 44 సీట్లు ఉన్నాయి. ఒకేషనల్ (వృత్తి విద్యా కోర్సు)లు ఆరు ఉన్నాయి. ఇందులో ఎలక్ట్రికల్ టెక్నీషియన్ (ఈటీ), ఆఫీస్ అసిస్టెంట్‌షిప్ (ఓఏఎస్), బాలికలకు మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (ఎంపీహెచ్‌డబ్ల్యూ), కంప్యూటర్ సైన్స్ (సీఎస్), మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ (ఎంఎల్‌టీ), అకౌంట్స్ అండ్ ట్యాక్సేషన్ (ఏటీ) మొదలైన కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ కోర్సులకు సంబంధించి ఒక్కోదానికి 20 సీట్లు వరకు ఉన్నాయి. అయితే ఇక్కడ నిర్దేశించిన విధంగా కాకుండా, ఎక్కువ మంది వచ్చినా ప్రవేశాలకు అవకాశాలు కల్పిస్తున్నారు. దీంతో కొన్ని గ్రూపుల్లో ఉన్న సీట్ల కన్నా ఎక్కువమంది చేరుతున్నారు.

జూలై 31వరకు ప్రవేశాలు



ఈ కళాశాలలో జూలై 31వ తేదీ వరకు ప్రవేశాలకు అవకాశం ఉంది. ఇప్పటికే చాలా వరకు సీట్లు భర్తీ అయ్యాయి. ఇక్కడ అన్ని విధాలా వసతులు బాగుండడంతో ఇందులో చేరడానికి ముందుకు వస్తున్నారు. ఈ నెలాఖరు వరకు అవకాశం ఉండడంతో అవసరమైనవారు చేరవచ్చు.



తరగతి గదిలో కొత్త బెంచీలు, డెస్కులు, డిజిటల్ బోర్డు



ఆర్వో ప్లాంట్ వద్ద నీరు తాగుతున్న విద్యార్థులు

ప్రస్తుతం భర్తీ అయిన సీట్లు

రెగ్యులర్ గ్రూపులు, వృత్తి విద్యాకోర్సుల్లో కలిపి మొత్తం **347** సీట్లు భర్తీ అయ్యాయి.

గ్రూపు	భర్తీ అయిన సీట్లు
ఎంపీసీ	38
బైపీసీ	43
సీఈసీ	33
హెచ్‌ఈసీ	26
మొత్తం	140

వృత్తి విద్యాకోర్సుల్లో..

గ్రూపు	భర్తీ అయిన సీట్లు
అకౌంట్స్ అండ్ ట్యాక్సేషన్	26
ఆఫీస్ అసిస్టెంట్ షిప్	23
కంప్యూటర్ సైన్స్	35
ఎలక్ట్రికల్ టెక్నీషియన్	26
మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్	52
మల్టీపర్పస్ హెల్త్ వర్కర్	45
మొత్తం	207

ఇంటర్‌లో 2024-25లో ఉత్తీర్ణత శాతం

జనరల్ గ్రూపుల్లో మొత్తం 112 మంది పరీక్షలకు హాజరు కాగా, అందులో 96 మంది ఉత్తీర్ణులయ్యారు. 86 శాతం ఉత్తీర్ణత సాధించారు.

గ్రూపు	మొత్తం విద్యార్థులు	ఉత్తీర్ణులైన వారు
ఎంపీసీ	42	40
బైపీసీ	33	30
సీఈసీ	23	17
హెచ్‌ఈసీ	14	9

ఒకేషనల్ కోర్సుల్లో 185 మందికి 183మంది ఉత్తీర్ణులయ్యారు. 99 శాతం ఉత్తీర్ణత సాధించారు.

గ్రూపు	మొత్తం విద్యార్థులు	ఉత్తీర్ణులైన వారు
అకౌంట్స్ అండ్ ట్యాక్సేషన్	25	25
సీఎస్‌టీ	33	33
ఈటీ	14	14
ఎంపీడబ్ల్యూహెచ్	36	36
ఓఎస్	23	22
ఎంఎల్‌టీ	54	53

అవకాశాన్ని వినియోగించుకోండి



కళాశాలలో విద్యార్థులకు చక్కని సదుపాయాలు, అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారు. చక్కని బోధనతో పాటు విద్యార్థులకు ఏ సందేహాలు వచ్చినా నివృత్తి చేస్తారు. దీంతో ఏ ఇబ్బంది లేకుండా చదువుకోవచ్చు. ప్రస్తుతం అడ్మిషన్లు జరుగుతున్నాయి. విద్యార్థులు మరింతమంది చేరవచ్చు. ఈ అవకాశాన్ని ఎక్కువ మంది విద్యార్థులు ఉపయోగించుకోవాలి. – పి.రాంప్రసాద్, ప్రిన్సిపాల్

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

పద్మనాభం: విద్యుత్ లైన్లలో చెట్ల కొమ్మలు తొలగించే పనులు చేపట్టనున్నందున పలు గ్రామాలకు శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ జగన్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా కోరాడ, గెద్దపేట, భద్రయ్యపేట, లింగన్నపేట, బొత్సపేట, బుడ్డివలస, పాండ్రంగి, మునివానిపేట, గంధవరం, మద్ది, విలాస్కాన్‌పాలెం, బాందేవుపురం, తునిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలియజేశారు.

గిడిజాల సబ్‌స్టేషన్ పరిధిలో రేపు..

తగరపువలస: ఆనందపురం మండలం 33/11 కేవీ గిడిజాల సబ్‌స్టేషన్ వద్ద నిర్వహణ పనుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ సింహాచలం నాయుడు తెలిపారు. ఈ కారణంగా నీళ్లకుండీల జంక్షన్, మిందివానిపాలెం, గుమ్మడివానిపాలెం, శొంఠ్యాం గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేట సామాజిక భవనం వద్ద నియో విజన్ నియో స్కిన్ ఆస్పత్రి సౌజన్యంతో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కంటి సమస్యలు, చర్మ సమస్యలకు సంబంధించి సుమారు 200 మందికి వైద్య పరీక్షలు చేశారు. వైద్యులు సుహాసిని, బాలకృష్ణ రోగులకు సేవలు అందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మేరుగు చిన్నారావు, దూడ నర్సింగ్, ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



పీఎం పాలెం: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. స్థానిక సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. సుమారు 45 సంవత్సరాల వయసు గల వ్యక్తి ఈ నెల 11వ తేదీన బక్కన్నపాలెంలోని ఓ భవనంలో తాపీ పని చేస్తుండగా ఫిట్స్ వచ్చి కిందకు పడిపోవడంతో, తోటి పనివారు చికిత్స నిమిత్తం కేజీహెచ్‌లో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ ఆ వ్యక్తి మరణించగా, స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అయితే ఆ వ్యక్తి పేరు, వివరాలు లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు 94407 96060 , 0891- 272133, నంబర్లకు ఫోన్ చేసి, పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ కోరారు.

ఉచిత కంటి వైద్య శిబిరం రేపు

తగరపువలస: శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, వెంపాడ వెల్ఫేర్ సొసైటీల ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు సంగివలస సుఖీభవ కాలనీ ఎదురుగా లక్ష్మి విజయ మెడికల్ ఆస్పత్రి వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ శిబిరానికి వచ్చే వారు ఆరోగ్యశ్రీ, ఆధార్‌కార్డు, ఇతర గుర్తింపు కార్డులు, బ్యాంక్ పాస్‌పుస్తకం, రెండు జతల బట్టలు, ఫోన్ నంబర్, కంచం, గ్లాసు తీసుకురావాలని నిర్వాహకులు తెలిపారు. వివరాలకు 85002 64289, 76610 20762 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పారిశుధ్య పనులపై డీపీవో ఆరా



రేవిడిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో

పద్మనాభం: మండలంలోని రేవిడిలో జిల్లా పంచాయతీ అధికారి ఎంపీఏ శ్రీనివాసరావు గురువారం పర్యటించారు. పారిశుధ్య పనులు ఏ మేరకు చేపడుతున్నారో ఆరా తీశారు. రక్షిత మంచి నీటి పథకాలను క్లోరినేషన్ చేస్తున్నారా? లేదా పరిశీలించారు. చెత్త నుంచి సంపద తయారు చేసే షెడ్‌ను పరిశీలించారు. ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, డిప్యూటీ ఎంపీడీవో మీనా కుమారి పాల్గొన్నారు.

‘కూటమి’ మోసాలను ప్రతి గడపకు తీసుకువెళ్లాలి

- వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త చిన్న శ్రీను
- ఆరో వార్డు నాయకులతో సమావేశం



వార్డు నాయకుల సమావేశంలో పాల్గొన్న చిన్న శ్రీను

కొమ్మాది: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో ఏ విధంగా ప్రజలను మోసం చేస్తుందో వివరించే ‘బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ’ కార్యక్రమాన్ని ప్రతి గడపకు తీసుకుని వెళ్లాలని వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) పిలుపునిచ్చారు. ఎండాడలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జీవీఎంసీ 6వ వార్డు నాయకులతో గురువారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. నియోజకవర్గంలోని ప్రతి వార్డులో పార్టీ బలోపేతానికి నాయకులు మరింత కృషి చేయాలని కోరారు. వార్డులో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వార్డులో ఏ నాయకుడికి కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు బొట్టా అప్పలరాజు, గుడ్ల పోలిరెడ్డి, పోతిన శ్రీనివాస్, పోతిన హనుమంతు ముఖ్యనాయకులు పోతిన ప్రసాద్, సియాద్రి కనకరాజు, రాయని సాయి, నర్సింహారావు, అవతార్ సింగ్, పోతిన సూరిబాబు, వేణు గోపాలరెడ్డి, కోరాడ రాజు, పోతిన ఎల్లాజీ, పోతిన మూర్తి బాబు, పాట్నూరు సురేష్, వరలక్ష్మి, చేకూరి రజని, ఈశ్వరరావు, జాన్ శివ తదితరులు పాల్గొన్నారు.

అపస్మారక స్థితిలో మహిళ

కేజీహెచ్‌కు తరలింపు



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మహిళ

పీఎం పాలెం: స్థానిక ఆఖరి బస్టాపు వద్ద అపస్మారక స్థితిలో ఉన్న సుమారు 30 సంవత్సరాల మహిళను పీఎం పాలెం పోలీసులు చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించి స్థానిక సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఓ మహిళకు ఫిట్స్ రావడంతో అపస్మారక స్థితిలో పడి ఉందని స్థానికులు బుధవారం రాత్రి 8–30 గంటల సమయంలో పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఆమెను 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలించారు. ఆమెకు సంబంధించిన వివరాలు తెలియరాలేదు. వివరాలు తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ కోరారు.

‘నవోదయ విద్యాలయ’ను సందర్శించిన కలెక్టర్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

కొమ్మాది: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయను కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యాలయ మేనేజ్‌మెంట్ కమిటీ మీటింగ్‌కు అధ్యక్షత వహించారు. గత విద్యా సంవత్సరంలో చేపట్టిన కార్యక్రమాలను పరిశీలించారు. ప్రిన్సిపాల్ వైఎస్ఎన్ చంద్రశేఖర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యాలయంలో జరుగుతున్న కార్యక్రమాలను వివరించారు. అనంతరం తరగతి గదులు, డిజిటల్ బోర్డులు, నోట్ పుస్తకాలను కలెక్టర్ పరిశీలించారు. మైగ్రేషన్ విధానంలో మధ్యప్రదేశ్‌లోని గుణ జిల్లా నుంచి వచ్చిన విద్యార్థులతో మాట్లాడి, వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. తల్లిదండ్రులతో సంభాషించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు, విశాఖ వ్యాలీ స్కూల్ ప్రిన్సిపాల్ ఈశ్వరీ ప్రభాకర్, తల్లిదండ్రుల కమిటీ ప్రతినిధి ఎన్.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యలకు సత్వర పరిష్కారం



మాట్లాడుతున్న వేదిక చైర్మన్ సత్యనారాయణ

పద్మనాభం: విద్యుత్ వినియోగదారుల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక జిల్లా చైర్మన్, రిటైర్డ్ జడ్జి బి.సత్యనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బిల్లింగ్ లోపాలు, విద్యుత్ తీగలు, కేబుల్ మరమ్మతులు తదితర సమస్యల గురించి విద్యుత్ వినియోగదారులు ముందుగా స్థానిక విద్యుత్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు ఇవ్వాలన్నారు. ఇలా చేసినా విద్యుత్ పంపిణీ సంస్థ సమస్యను నిర్దేశిత గడువులోగా పరిష్కరించకుండా కాలయాపన చేస్తే విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానానికి పోస్టు ద్వారా లేదా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ వేదికలో 25 మంది వినతి పత్రాలు ఇచ్చారు. ఈఈలు బి.సింహాచలం నాయుడు, ఎం.ధర్మరాజు, ఏఈ జగన్మోహనరావు, సభ్యులు ఎస్.రాజబాబు, ఎస్.మురళీ కృష్ణ పాల్గొన్నారు.

గిడిజాలలో విద్యార్థులకు అవగాహన

తగరపువలస: ఆనందపురం మండలం గిడిజాల సాయి గణపతి పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం విద్యార్థులకు విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి వేదిక చైర్మన్ సత్యనారాయణ మాట్లాడారు. వేదిక విధులను గురించి తెలియజేశారు. ఈపీడీసీఎల్ ఈఈ(టెక్నికల్) బి.ధర్మరాజు, జోన్–3 ఈఈ బి.సింహాచలం నాయుడు ప్రసంగించారు. వేదిక సభ్యుడు ఎస్.రాజబాబు, కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.మహేశ్వరరావు, ఆనందపురం ఏడీఈ ఎస్.రాజశేఖర్, ఏఈఈ ఎం.అప్పలనాయుడు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకోండి



కాలనీ వద్ద ప్రచారం నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

భీమునిపట్నం: ప్రజలకు అన్ని విధాలా నష్టం కలిగించే స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేయడానికి వచ్చేవారిని అందరూ అడ్డుకోవాలని భీమిలి జోన్ సీపీఎం కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్.మూర్తి సూచించారు. భీమిలి నేరెళ్లవలస కాలనీ శివారు ప్రాంతంలోని రాజీవ్ గృహకల్ప కాలనీ వద్ద గురువారం నిర్వహించిన ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు బాధ్యతను అదానీ ప్రైవేట్ కంపెనీకు ప్రభుత్వం అప్పగించిందని, పైగా పది సంవత్సరాలకు అవకాశం కల్పించిందని అన్నారు. ఇలా ప్రభుత్వం ప్రైవేటు వారికి దీన్ని అప్పగిస్తే విద్యుత్ చార్జీలు ఇష్టానుసారంగా పెంచేస్తారని, అందరూ చాలా ఇబ్బంది పడవలసి వస్తుందని చెప్పారు. ఇప్పటికే విద్యుత్ చార్జీలను ఇష్టానుసారంగా పెంచుతున్నారని, రానున్న రోజుల్లో పరిస్థితి మరింత దారుణంగా మారకముందే దీనిని అడ్డుకోవాలని కోరారు.

కాంక్రీట్ మిక్సర్ ట్రక్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

పీఎం పాలెం: జాతీయ రహదారి దాటుతున్న వ్యక్తిని కాంక్రీట్ మిక్సర్ ట్రక్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. గురువారం రాత్రి 9 గంటల సమయంలో చోటు చేసుకున్న ఈ సంఘటనకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. బోయిపాలెం నుంచి కొమ్మాది వైపు వస్తున్న కాంక్రీట్ మిక్సర్ ట్రక్ మారికవలస కూడలికి సుమారు 50 అడుగుల దూరంలో జాతీయ రహదారి దాటుతున్న వ్యక్తిని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీ హెచ్‌కు తరలించారు. మృతుడు మారికవలసకు చెందిన వ్యక్తిగా పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. పూర్తి వివరాలు తెలియవలసి ఉంది.

కేజీబీవీ విద్యార్థులకు ‘మాన్సాస్ ట్రస్ట్’ నగదు బహుమతులు



కేజీబీవీ విద్యార్థులతో అశోక్ గజపతిరాజు

తగరపువలస: మహారాజా అలక నారాయణ సొసైటీ ఆధ్వర్యంలో పూసపాటి ఆనందగజపతి రాజు జయంతి వేడుకలను భీమిలి కేజీబీవీలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి, ఇంటర్మీడియట్‌లలో అత్యుత్తమ ప్రతిభ కనపరచిన 50 మంది విద్యార్థులకు రూ.5వేలు వంతున నగదు బహుమతులు అందించారు. వీరిలో ఆనందపురం కేజీబీవీ నుంచి 18 మంది, పద్మనాభం, భీమిలి కేజీబీవీల నుంచి 16 మంది వంతున ఉన్నారు. ఈ నగదు బహుమతులను మాన్సాస్ ట్రస్ట్ తరపున మాజీ కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏపీసీ జోగ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కృష్ణాపురం ‘ఆశ’ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురం సచివాలయ ఆశ కార్యకర్త పోస్టుకు అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి కె.లీలా ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థి వయసు 25 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండాలని తెలియజేశారు. టెన్త్ పాసవ్వాలని, స్థానిక నివాసితులై ఉండాలని తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులైన వారికి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. వీహెచ్ఎన్‌సీ కమిటీ తీర్మానం, నివాస ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, విద్యార్హత ఉత్తీర్ణత జిరాక్సు కాపీలను దరఖాస్తుతో జత చేయాలని తెలియజేశారు.

టీడీపీలో ఒక వర్గం ఎమ్మెల్యేకు ఇంకా దూరంగానే ..

తగరపువలస: జీవీఎంసీ రెండోవార్డు, భీమిలి మండలంలోని ఒక వర్గం ఇంకా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో అంటీముట్టనట్టుగానే వ్యవహరిస్తున్నారు. వాస్తవానికి గురువారం మండలంలోని తాటితూరులో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించవలసి ఉన్నా మొదటి నుంచి టీడీపీలో ఉన్న వర్గం అధ్యక్ష పదవిపై స్పష్టత రానందున రెండు వారాలుగా పార్టీ కార్యక్రమాలను బహిష్కరిస్తున్నారు. ఎన్నికల ముందు వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి వెళ్లినవారు ఈ కార్యక్రమం నిర్వహించడానికి సుముఖత వ్యక్తం చేసినా జరగలేదు. అలాగే చిప్పాడలో నిర్వహించిన కార్యక్రమాలలో కూడా పార్టీ మండల అధ్యక్షుడు డీఏఎన్ రాజు వర్గం పాల్గొనలేదు. దీంతో అంతంతమాత్రంగానే కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. రోజురోజుకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, డీఏఎన్ రాజు వర్గానికి అంతరం పెరుగుతూనే ఉంది. జీవీఎంసీ రెండోవార్డులోనూ ఎమ్మెల్యేకు, మరొక వర్గానికి కూడా ఇప్పటి వరకు పొత్తు కుదరలేదు.

పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం

పద్మనాభం: మండలంలోని రెండు పీఏసీఎస్‌ల త్రిసభ్య కమిటీల సభ్యులు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. పాండ్రంగి పీఏసీఎస్‌లో చైర్మన్‌గా బార్నాల శ్రీనివాసరావు, ఇద్దరు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. వీరిని మాజీ ఎమ్మెల్యే ఆర్ఎస్‌డీపీ అప్పల నరసింహరాజు అభినందించారు. రెడ్డిపల్లి పీఏసీఎస్‌లో చైర్మన్‌గా కె.శ్రీరాములు, ఇద్దరు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో జిల్లా సహకార సంఘ సహాయక రిజిస్ట్రార్ ప్రసాద్, మాజీ జెడ్పీటీసీ కె.దామోదరరావు పాల్గొన్నారు.

బెల్టు షాపులపై దాడి

పద్మనాభం: మండలంలోని రెండు గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తున్న ఇద్దరిపై గురువారం కేసు నమోదు చేసి, వీరి నుంచి 15 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పాండ్రంగి పంచాయతీ సామయ్యవలసలో బెల్టు షాపు నిర్వహిస్తున్న కోన సురేష్ వద్ద నుంచి నాలుగు మద్యం సీసాలు, కృష్ణాపురంలో బెల్టు షాపు నిర్వహిస్తున్న అవనాపు ఆదిబాబు నుంచి 11 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సురేష్, ఆదిబాబులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నాన్హి కలి ప్రాజెక్టుకు తాటితూరు హైస్కూల్ ఎంపిక



ప్రాజెక్టు నిర్వాహకులతో హైస్కూల్ విద్యార్థులు

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు జెడ్పీ హైస్కూల్ నాన్హి కలి ప్రాజెక్ట్ 3.0కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు తెలిపారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 6 నుంచి 9వ తరగతి చదువుతున్న బాలబాలికలకు విడివిడిగా ఆట పరికరాలు పంపిణీ చేసి, తరచూ ఆటలు నిర్వహిస్తారన్నారు. ప్రాజెక్ట్ ఎస్ఏ తాటిపూడి రేణుక మాట్లాడుతూ గతేడాది కూడా ఈ పాఠశాల నాన్హి కలి ప్రాజెక్టుకు ఎంపికైందన్నారు. ప్రాజెక్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖాతాదారుని కుటుంబానికి రూ.10 లక్షల బీమా

తగరపువలస: ఆనందపురం మండలం మామిడిలోవ పంచాయతీకి చెందిన ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఖాతాదారుడు జి.సన్యాసప్పుడు భార్య అప్పలకొండకు, బ్యాంక్ విశాఖ రీజనల్ మేనేజర్ చిరంజీవి వెంకటేష్ గురువారం రూ.10 లక్షల బీమా పరిహారం అందించారు. ఇటీవల సన్యాసప్పుడు ప్రమాదవశాత్తు మృతి చెందడంతో ఈ బీమా సొమ్ము అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో శొంఠ్యాం, వేములవలస బ్రాంచ్ మేనేజర్లు స్వప్న, శ్రీనివాసరావు, ఎఫ్ఐసీ షానావాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గుర్తింపు కార్డుల పంపిణీ

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన 65 మంది విద్యార్థులకు ఉపాధ్యాయులు రూ.4వేలతో సొంతంగా గుర్తింపు కార్డులు సమకూర్చారు. వాటిని గురువారం విద్యార్థులకు అందజేశారు. ప్రధానోపాధ్యాయిని ఇందుమతి, ఉపాధ్యాయులు కె.సన్యాసినాయుడు, ఇ.ప్రతాప్‌కుమార్, టి.పోతురాజు పాల్గొన్నారు.

ఉత్తమ యాజమాన్య పద్ధతులలో పొలంబడి

తగరపువలస: భీమిలి మండలం శింగనబంద పంచాయతీ మద్దిలపేటలో గురువారం ఉత్తమ యాజమాన్య పద్ధతులలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. 25 ఎకరాలలో 30 మంది రైతులతో ఈ కార్యక్రమం అమలు చేస్తున్నట్టు భీమిలి వ్యవసాయాధికారి బి.శివకోమలి తెలిపారు. వరి సాగులో వస్తున్న శాస్త్రీయ పద్ధతులు, ఎరువులు, పురుగు మందుల వినియోగం తదితర అంశాలపై 14వారాల పాటు రైతులకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. వ్యవసాయ విస్తరణ అధికారి స్వాతి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలలో తరగతి గదులు ప్రారంభం

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ జెడ్పీ హైస్కూల్లో దివీస్ లేబొరేటరీ రూ.1.18 కోట్ల సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన ఆరు తరగతి గదులను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. అలాగే దివీస్ అందించిన ఫర్నిచర్, కళావేదికలను కూడా ప్రారంభించారు. డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్, దివీస్ జనరల్ మేనేజర్ ఎం.ఎస్.ఎన్.రావు, సర్పంచ్ వెంపాడ రమావతి, ఎంపీటీసీ సభ్యురాలు చుక్క ఈశ్వరమ్మ, స్కూల్ కమిటీ చైర్మన్ చిల్ల శంకరరెడ్డి, దివీస్ సీఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

170 మందికి ఉచిత వైద్య పరీక్షలు

పద్మనాభం:పెంట గ్రామంలో విజయనగరం సాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అధినేత ఎ.శ్రీరామ్మూర్తి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 170 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ బోదల పావని ప్రారంభించారు. వైద్యురాలు ఎం.జ్యోత్స్న రోగులను పరీక్షించారు. గ్రామీణ వైద్యుల సంఘం మండల అధ్యక్షుడు రాలి అప్పారావు ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు.